క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఖానాపురం: గ్రామాల అభివృద్ధే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి లక్ష్యమని మాజీ ఎంపీటీసీ మూడు పూల్‌సింగ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మంగళవారిపేటలో ఆయన మాట్లాడారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.23 లక్షలు, సింగరేణికి సంబంధించిన నిధులు రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు, మహిళా సంఘ భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మగాని నవీన్, పులిగిల్ల నాగరాజు, కొంరయ్య, మచ్చ వెంకన్న, మల్లేశ్, కుమారస్వామి, సునీల్, భిక్షపతి, చిన్నవెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పర్వతగిరి: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఎల్లయ్య వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. దీంతో వెన్ను, కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఎల్లయ్యను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

మహిళలు అభివృద్ధి సాధించాలి

పర్వతగిరి: మహిళలు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని తెలంగాణ రాష్ట్ర జేడీ ఫౌండేషన్ కన్వీనర్ కవితరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఏనుగల్ గ్రామానికి చెందిన నిరుపేద వితంతువు మంద రేణుకకు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధి భరోసా ద్వారా జీవనోపాధి కోసం కులవృత్తి అయిన చేపల అమ్మకం షాపును పెట్టించారు. ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



రాయపర్తి: మండలంలోని మైలారం, జేతురాం తండాల్లో పలువురు బాధిత కుటుంబాలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్‌చైర్మన్,బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా జేతురాం తండాలో కరెంట్‌షాక్‌కు గురై చికిత్సపొంది విశ్రాంతి తీసుకుంటున్న గుగులోతు బాల్‌రాజ్‌ను పరామర్శించి ఆర్థిక సహాయంను అందించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధికారప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, లేతాకుల సుధాకర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, ఎండీ యూసుఫ్, నేతావత్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి..



చెన్నారావుపేట: స్నేహితుడి కుటుంబానికి చిన్ననాటి మిత్రులు ఆర్థిక సాయం అందించి ఔదార్యం చాటారు. మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఎండీ అంకూస్ ఇటీవల మృతిచెందాడు. అంకూస్‌తో కలిసి చదువుకున్న మిత్రులు అతని భార్య ముంతాజ్, కుమారుడు ఫిరోజ్‌లకు శనివారం రూ.25 వేల అందించారు. కార్యక్రమంలో గడ్డం వీరేందర్, కొక్కు నర్సింహస్వామి, అల్లి రవి, జూలూరు సతీష్, గుర్రం రాజనర్సయ్య, గౌడిశాల వెంకటగిరి, గోలి రవిందర్, సదయ్య, వెంకట్రామ్, నర్సయ్య, ఆకుల అశోక్, సుమన్ ఉన్నారు.

పరామర్శ

గీసుకొండ: ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు చింతం సదానందం తల్లి వెంటలక్ష్మి నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు నాయకులు శనివారం సదానందంను పరామర్శించారు.

బీజేఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సంపేట: భారత జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ (బీజేఎస్ఎఫ్) వరంగల్ జిల్లా అధ్యక్షుడు తడిగొప్పుల మల్లేష్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. జాగృతి చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణ గురించి వివరించారు. విద్యార్థి నాయకులకు అత్యంత క్రియాశీలకంగా పని చేసినప్పుడే ప్రభుత్వాలు సక్రమంగా పని చేస్తాయని తెలిపారు.

మత్తడినే మింగేశారు..!

చెరువులోనే పంటల సాగు
- పట్టా చేసిన రెవెన్యూ అధికారులు
- చోద్యం చూస్తున్న ఐబీ అధికారులు



ఆక్రమణకు గురైన కోపాకుల చెరువు మత్తడి శిఖం

చెన్నారావుపేట: కాల్వలపై, చెరువులలో, కుంటల్లో అక్రమంగా కట్టుకున్న ఇళ్లనే రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేస్తుంది.. కానీ గ్రామాల్లో ఎందుకు అధికారులు చర్యలు తీసుకుంటలేరో మరి.. చెరువులు, కుంటలనే సమీపంలోని రైతులు మింగేస్తున్నా రెవెన్యూ, ఐబీ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా ఉంటున్నారు. నాలుగు రోజులు ఉద్యోగం చేసి బదిలీపై మరో చోట ఇదే ఉద్యోగం చేసుకుంటా అన్నట్లుగా వ్యవహరిస్తురని పలువురు ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. అంతేకాదండయ్.. మత్తడి స్థలానికి కూడా పట్టాలు చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఆ పట్టాలు చూపించి యదేశ్చగా సాగు చేసుకుంటున్నారు. ఇదేంటి మత్తళ్లలో పంటలు సాగు చేస్తున్నారు అని ఎవరన్నా.. ప్రశ్నిస్తే పట్టా భూమి.. కాబట్టే సాగు చేస్తున్నామని సమాధానమివ్వడం కొసమెరుపు. పట్టా క్యాన్సల్ చేసి చెరువును కాపాడే పవర్ అధికారులకు లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నాణెంలాగే చెరువులు

ప్రస్తుత కాలంలో ఒక పైసా నుంచి రూపాయి బిల్లలోపాటు పలు రకాల నోట్లు కనుమరుగు కావడంతో వాటిని దాచుకుని భవిష్యత్ తరాలకు మేము వాడిన నాణాలు, నోట్లు అని చెప్పుకుంటున్న మాదిరిగా రెవెన్యూ అధికారులు, ఐబీ అధికారుల నిర్లక్ష్యంతో చెరువులు ఇలా ఉండేటివి అని ఫొటోలో రూపంలో చూపించుకోవాల్సిన పరిస్థితి దాపురించనుంది. ఎందుకంటే కాసులకు కక్కుర్తి పడి చెరువులకే పట్టాలు చేసిన ఘనత రెవెన్యూ అధికారులకు దక్కుతుంది. సేద్యం చేసుకుంటున్న రైతులకు పట్టాలు చేయడానికి ధరణి నియమాలు అడ్డు వచ్చిన రెవెన్యూ అధికారులకు చెరువులకు, కుంటలకు, గుట్టలకు పట్టాలు చేయడానికి నియమ నిబంధనలు ఎందుకు రాలేదో వారికే తెలియాలి. మత్తడిని ఆక్రమించుకొని సాగు చేస్తున్న రైతులపై చర్యలు తీసుకోని పట్టా రద్దు చేయాలని ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చెన్నారావుపేట శివారులోని కోపాకుల చెరువు శిఖం సర్వే నంబర్ 388లో సుమారుగా 360 ఎకరాలకు పైగా ఉంటుంది. దాని కింద 596 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతుంది. కానీ కొందరు రైతులు రెవెన్యూ అధికారులకు డబ్బు ఆశచూపి మత్తడికి పరిధిలో చెరువు శిఖం భూమికి పట్టాలు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం యదేచ్ఛగా మొక్కజొన్న, వరి పంటను సాగు చేసుకుంటున్నారు. మత్తడి కింది భాగం కూడా ఆక్రమణకు గురైంది. ఇది రెవెన్యూ అధికారులకు తెలిసిన ఏమి చేయలేకపోతున్నారు.

చెరువును కాపాడాలి



ఆక్రమణకు గురవుతున్న చెరువులను కాపాడాలి. అక్రమంగా పట్టాలు చేసుకున్న ఆక్రమదారుల పట్టాలను రద్దు చేయాలి. చెరువులను సంరక్షించకపోతే భవిష్యత్ తరాలకు వ్యవసాయం చేయడానికి చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంటుంది

– చిట్టి రవి, ఆయకట్టు రైతు

నీటి శాతం తగ్గుతుంది..



చెరువును ఆక్రమించుకోవడమే కాకుండా చెరువులోని మట్టిని తీసి ఆక్రమించిన భూమిలో ఎత్తుగా పోయడం వలన ప్రతి సంవత్సరం లెక్కలల్లో చెరువు విస్తీర్ణం కనిపించిన విధంగా విస్తీర్ణం లేకపోవడంతో నీటి శాతం తగ్గుతుంది. సర్వే చేసి చెరువు విస్తీర్ణం ప్రకారం హద్దులు ఏర్పాటు చేసి చెరువును కాపాడాలి.

– హంస వీరస్వామి, చెరువు నీరటి

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా



కొమ్మాలలో ధర్నా చేస్తున్న నాయకులు

గీసుకొండ: మండలంలోని కొమ్మాల బస్‌స్టేజి వరంగల్–నర్సంపేట రహదారిపై ఎంసీపీఐ(యు) నాయకులు, కార్యకర్తలు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించలేదంటూ నిరసన తెలుపుతూ శనివారం ధర్నా జరిపారు. రోడ్డుకు అడ్డంగా బైఠాయించి బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపినందుకు ఆ పార్టీ రాష్ట్ర ఎంపీలు, మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, జిల్లా, మండల నాయకులు కనకం సంధ్య, గూడ సురేశ్, బండి బుచ్చయ్య, సోమిడి రవీందర్, సాంబయ్య, జక్కుల రాజు , గాదం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

సంగెం: సంగెం మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఎంసీపీఐ(యూ) నాయకులు శనివారం కేంద్ర సర్కారు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్రానికి మొండి చేయి చూపిన సర్కారుకు ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి ఎండి ఇస్మాయిల్, నాయకులు గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, జెక్క అశోక్, ఐలయ్య, మల్లారెడ్డి, యారా సంపతి , వీరాచారి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించకపోవడం సరికాదు



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నర్సంపేట: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం సరికాదని ఇది వివక్షతకు నిదర్శనమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మల్లంపల్లి రోడ్డులో శనివారం ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు సబ్సిడీలు, రాయితీలు, రుణమాఫీలు చేస్తూ ఉత్పత్తి శక్తులైన పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపే విధంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆందోళనకరమన్నారు. గతంలో సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, రైతుల ఎరువుల సబ్సిడీకి భారీగా కోత విధించాలని జాతీయ ఆహార భద్రతకు కనీస నిధులు లేవని, రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎలాంటి అభివృద్ధి నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కుక్కల యాకయ్య, మోటం సురేష్, బండారి మల్లేష్, ఎండి.ఖాజా, గడ్డం స్వరూప, పుట్టపాక సునీత, మేడిద ప్రమీల, గడ్డం నిర్మల, దంపల్లి ప్రమీల, ఈర్ల అనూష, సతీష్, వెంకన్న, కొమ్మాలు, రజిత, పుష్ప, శ్రీను, రాజు, చంద్రకళ, అచల, ప్రభాకర్, తులసి, తదితరులు పాల్గొన్నారు.

వాగ్వాదాల నడుమ ముగిసిన మహాజన సభ



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక వార్షిక మహాజన సభ చైర్మన్ సుకినె రాజేశ్వర్‌రావు అధ్యక్షతన శనివారం జరిగింది. సభ ప్రారంభం కాగానే సొసైటీలో అవినీతి జరిగిందంటూ కొంతమంది నిబంధనల ప్రకారమే ఖర్చు చేశామని కొంత మంది అనడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. సొసైటీ పరిధిలో సంఘం పాలకవర్గ సభ్యులందరి ఆమోదం మేరకు నిధులు ఖర్చు చేశామని, తీర్మానాలు లేకుండా ఒక్కపైసా దుర్వినియోగం చేయలేదని చైర్మన్ రాజేశ్వర్‌రావు రైతులకు వివరించారు. అవినీతి జరిగిందనే ఆరోపణలపై అంశాల వారీగా వివరణ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందని కొంత మంది గొడవకు దిగారు. అవినీతి జరిగిందని కొందరు, జరగలేదని కొందరు వాదించారు. అనంతరం కాసేపటికి సభను ముగించారు. సభ ముగిశాక పాలకవర్గ సభ్యులంతా సొసైటీ కార్యాలయంలోకి వెళ్లాక డైరెక్టర్ల సమక్షంలో చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ గుడిపెల్లి ధర్మారెడ్డి ఘర్షణకు దిగారు. ఇదే క్రమంలో సభ్యుల ముందే మినిట్ బుక్‌లోని తీర్మాన ప్రతులు చింపేసినట్లు తెలిసింది. కార్యక్రమంలో డైరెక్టర్లు నరహరి భాస్కర్‌రెడ్డి, సూరారెడ్డి, సునితరాజుకుమార్, సాంబయ్య, పురుషోత్తం, సంజీవరావు, ప్రభాకర్, శ్యాంసుందర్‌రెడ్డి, సదానందం, బాబు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడం పై ఆపార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో సైతం పార్టీ విజయం సాధిస్తుందని ఈసందర్భంగా పలువురు నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకోసం ప్రతి కార్యకర్తల కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట పట్టణంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



చెన్నారావుపేటలో..



వర్ధన్నపేట పట్టణంలో..



సంగెం మండల కేంద్రంలో..

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అపర్ణ

పర్వతగిరి: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ సంస్థ నిర్వహించిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రాంలో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ శనివారం మాట్లాడుతూ.. సమయం వృథా చేసే సామాజిక మాధ్యమాల స్థానంలో విద్యార్థులు మైండ్ స్పార్క్‌ను ఉపయోగిస్తూ తమ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. పాఠశాల స్థాయిలో ఎం.రిషికేశ్వరి అత్యధికంగా 137గంటలు మైండ్ స్పార్క్ వినియోగించి మొదటి బహుమతి గెలుచుకుందని తెలిపారు. ఎం.అనుశ్రీ 112గంటలు వినియోగించి రెండో స్థానం, ఎం.సహన, వి.సాత్విక, వి.కావేరి మూడో స్థానంలో నిలిచారని వెల్లడించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

కార్మికుల పథకాలకు నిధులు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నర్సంపేట: రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సర కాలంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు పెండింగ్‌లో పెట్టి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే నిధులు విడుదల చేయాలని బీఆర్‌టీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్య వేదిక సమావేశం శనివారం బుర్రి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో ఏ ఒక్క భవన నిర్మాణ కార్మికుడికి సంక్షేమ పథకాలు విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంన్నర గడుస్తున్న కార్మిక శాఖ మంత్రిని నియమించకపోవడం దారుణం అన్నారు. జిల్లాలో 24 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అప్రూవల్ చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా దాటవేస్తున్నారని తెలిపారు. ఏఎల్‌ఓ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించకపోవడం దారుణమన్నారు. నర్సంపేట ఏఎల్‌ఓ పరిధిలో ఎనిమిది మండలాలు ఉన్నప్పటికీ డేటా ఎంట్రీ ఆపరేటర్ లేకపోవడంతో వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గరికపాటి రాంగోపాల్, మోటూరి జీవన్, బుర్రి సాగర్, విరసారపు రాజుకుమార్, పేతు అశోక్, రాము, రఘు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఉమారాణి

ఖానాపురం: విద్యార్థులు విద్యలో రాణిస్తేనే విజ్ఞానం లభిస్తుందని, క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం చేయాలని డీఆర్డీఓ కౌసల్యదేవి, డీటీడబ్లూఓ సౌజన్య, ఆర్డీఓ ఉమారాణి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, మండలస్థాయి అధికారులు పాఠశాలలకు హాజరై 10 అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. పాఠశాలల్లో తెలియని విషయాలు తెలుసుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు జీవన నైపుణ్యాలను తప్పకుండా తెలుసుకోవాలన్నారు. ప్రతిరోజు దినచర్య సక్రమంగా పాటించాలని, మంచి నడవడికతో ముందుకు సాగాలని, క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం చేయాలని, మత్తుపదార్థాలు, సెల్‌ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశాల్లో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఏడీఆర్డీఓ రేణుకాదేవి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వసుమతి, ఎంఈఓ శ్రీదేవి, డీఆర్డీఓ డీపీఎంలు అనిత, దయాకర్, సరిత, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్, డీఆర్వో విజయలక్ష్మి, డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్, రిటైర్డ్ హెచ్‌ఎంలు కొలిశెట్టి పూర్ణచందర్‌రావు, రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సవంత్స్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. శనివారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలు 412మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్ డిస్కర్షన్ రౌండ్‌లో 112 మంది విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని, తర్వాత నిర్వహించిన టెక్నికల్ రౌండ్‌లో 34మంది విద్యార్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు రేవంత్, శ్యామ్, సాహిత, స్నేహ తెలిపారు. వీరిని బీటెక్ పూర్తయిన తర్వాత జాబ్‌లోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం నియామక పత్రాలను అందించారు. ఎంపికైన విద్యార్థులకు బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అభినందించారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హరిహరన్, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ముఖ్యప్రాంగణ నియామకపు అధికారి సురేష్, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధిపతి ఫసి అహ్మద్ ఫర్వేజ్,స్టూడెంట్ డీన్ అఫైర్ అధికారి ఫణింద్ర, టీపీఓ డాక్టర్ రణధీర్, సాంబశివుడు, పాల్గొన్నారు.

యాసంగి పంటల సర్వే

గీసుకొండ: మండలంలోని వంచనగిరి, గీసుకొండ, మొగిలిచర్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం ఏఓ హరిప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో యాసంగి పంటల సాగు డిజిటల్ సర్వే(డీసీఎస్) చేపట్టారు. రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఏఈఓలకు క్షేత్రస్థాయిలో చూపించి నమోదు చేయించుకోవాలన్నారు. ఏఈఓలు ఎ.సంపత్, కె.రజని, ఎం.కావ్య, రైతులు పాల్గొన్నారు.

'సఖి' సేవలపై అవగాహన



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మహిళలు

నల్లబెల్లి: మండలంలోని అర్వయ్యపల్లి, దస్తగిరిపల్లి గ్రామాల్లో గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో సఖి సెంటర్ వరంగల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి సేవల వివరాల బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం సఖీ సెంటర్ ప్రతినిధులు స్వప్న, తిరుమల మాట్లాడారు. బాలికలు, మహిళల హక్కుల రక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్‌లను ఏర్పాటు చేశాయన్నారు. మహిళలకు న్యాయ, వైద్య సాయం, తాత్కాలిక వసతి 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. ఏపీఎం సునిత, సీపీ పద్మ, మొగిలి, అనసూర్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

ఖానాపురం: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ధర్మరావుపేట ప్రభుత్వ పాఠశాలలో దాత మాద్రాజు వెంకన్న సొంత నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తూ అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చరణ్‌సింగ్, దాత మాద్రాజు వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బ్లాక్‌మెయిల్ చేయడమే రాజకీయమా..?

- మునావత్ నర్సింహానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహానాయక్

రాయపర్తి: ప్రతీ ఎలక్షన్‌లో బ్లాక్‌మెయిల్ చేయడమే రాజకీయమా..? అని బిల్లా సుధీర్‌రెడ్డిని బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి ప్రశ్నించారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బిల్లా సుధీర్‌రెడ్డి విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సుధీర్‌రెడ్డి ఓ ఒక కోవర్టు అనే విషయంలో జంగా రాఘవరెడి వార్నింగ్ ఇవ్వడంతోపాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు సోషల్ మీడియాలో బైకాట్ చేయడంతో ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రి అయ్యాక బీఆర్ఎస్ పార్టీలోకి వచ్చిన విషయం మర్చిపోయావా అని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, మండల అధికారప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, రాంచందర్, రాము, బాషబోయిన సుధాకర్, సంకినేని ఎల్లస్వామి, సతీష్, ఉప్పలయ్య, మర్రి వెంకటేశం, చిన్నాల యాదగిరి పాల్గొన్నారు.